

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాతుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### యుగాంతం

**అప్పుడెప్పుడో వీరేంద్రనాథ్ గారు** యుగాంతం అనే నవల రాసారు. రేపు మనం ఉండం. అసలు ఈ ప్రపంచమే ఉండదు అంటే మా ఎదురింటావిడ పెట్టే ముగ్గులూ.. అవి తొక్కి వెళ్ళేవాళ్ళని తిట్టే తిట్లూ, పక్క ఇళ్ళలోంచి వచ్చే భయంకరమైన వంట వాసనలు. మంచి నిద్రలో ఉన్నప్పుడు మోగే లాండ్‌లైన్ ఫోన్, లేదా డోర్‌బెల్ మోతా! టీ.వీ పెడితే వచ్చే రోత హాస్య ప్రోగ్రామ్‌లూ, వానాకాలం ప్రవహించే మురుగు కాలవలూ, దోమలూ నోళ్ళు తెరుచుకుని ప్రజల్ని బలి తీసుకునే మేన్‌హోల్స్ ... ఇలా చెప్పుకుంటూ పోతే నాకు నచ్చనివి ఏవీ రేపు ఉండవు. ప్రపంచం అంతం అయిపోతుంది అనే భావన ఎంత బావుంటుందీ? ఇంగ్లీషు వాళ్ళకి మరీ సరదా. ఈ విషయం మీద బోలెడు సినిమాలు తీసారు. ‘End of the World’ అని.

ఈవిడెవరండీ బాబూ? ప్రపంచం అంతం అయిపోతే బావుంటుంది అంటుంది అంటున్నారా? ఎంచక్కా రేపు ఏం వండాలా అని ఆలోచించక్కర్లేదు. అంటే కూరలు కొనక్కర్లేదు. అంటే డబ్బులు ఖర్చు పెట్టనక్కరలేదు. అంటే డబ్బులు సంపాదించక్కర్లేదు. అంటే ప్రొద్దుటే లేచి తయ్యారయి బయటికి వెళ్ళక్కర్లేదు. అంటే కార్లో పెట్రోల్ పోయించనవసరం లేదు. అప్పుడు డ్రైవర్‌ని పనిలో ఉంచనవసరంలేదు. వాడు కార్లో పెట్టే సోది పాటలు విననవసరం లేదు. అసలు నోటికి రెస్ట్ లేకుండా చెత్త అంతా వాగే రేడియో జాకీలు ఉండనవసరంలేదు. రోడ్డు మీద గతుకులు... జాకెట్లు పాడుచేసే టైలర్లూ, ఏదైనా పని పడితే ఖర్మకాలి రోజుల తరబడీ మన క్షమధర్మాలు నసించే దాకా తిప్పే గవర్నమెంట్ ఆఫీసులూ.. ఆఫీసుల్లో ఫ్యూన్ నుండి ఆఫీసర్లు దాకా ఆమ్యామ్యాలూ ఎప్పటికీ బాగు చెయ్యని గవర్నమెంట్ ఆఫీసుల్లో కంపు కొట్టే టాయ్‌లెట్లూ, ప్రతిచోటా అడ్డుపడే రాజకీయాలూ అవి చెయ్యడానికి రాజకీయ నాయకులూ.. వారిని కాపాడే గూండాలూ వాళ్ళు చేసే నేరాలూ. ఆ నేరాల కోసం వెలిసిన పోలీసు వ్యవస్థా. వాళ్ళు తీసుకునే లంచాలూ. ఎందుకు లంచం తీసుకున్నారంటే, చాలవనే జీతాలూ. జీతాలు పెంచడానికి నిధులు లేవనే ప్రభుత్వాలు వాటిని నడిపే నిర్భాగ్యులమైన మనం. మనం అగ్గిపెట్టె నుండి చావడానికి కొనుక్కునే విషం సీసా మీద దాకా కట్టే సేల్స్ టాక్స్‌లూ. వాటిలో మనల్ని పాలించే ఈ పాలకులూ! అమ్మో.. అమ్మో ఇవన్నీ రేపటినుండి అంతం అని వింటే మరి ఎగిరి గంతెయ్యాలనిపించదూ?

ఓసారి చిన్నప్పుడెప్పుడో మూసీ నది పొంగుతోంది. హైదరాబాద్ మునిగిపోతుంది అని ప్రచారం అయింది. మా బడి వదిలేసారు. ఆఫీసుల్లో జనం రోడ్ల మీదకొచ్చి ఇళ్ళకి పరుగులు, ఇళ్ళల్లో వాళ్ళు మేడలూ, డాబాలు ఎక్కి దాక్కోడాలు. ఇంకా కొంతమంది చార్మినార్

ఎక్కడానికి పరుగులు. ఇవి ఇలా ఉండగా, మా సూరమ్మగారు చేగోడీలూ, గుమ్మడి వడియాలూ ఉన్న డబ్బాలు మాత్రం పట్టుకుని పెద్ద మేడ వాళ్ళింటికి పరుగులు.

"అదేమిటి సూరమ్మ బామ్మా?"? అంటే,

"వరద తగ్గుతుంది కానీ అప్పుడు మళ్ళీ వెంటనే వడియాలూ, చేగోడీలూ వస్తాయా?" అంది. ఎంత డెడికేటెడ్ బామ్మో చూడండి.

ఇంకోసారి స్కూల్లో ఉండగా స్కైలాబ్ పడ్తాంది అన్నారు. నేను ఎంచక్కా మేథ్స్ చెయ్యక్కర్లేదని, టెక్స్ట్‌బుక్ చింపి పడవలు చేసి వాన నీళ్ళల్లో వేసి ఆడుకున్నాను. కానీ 'స్కైలాబ్' పడలేదు.

పట్టాభిరామయ్యగారి కొడుకులు ఆస్తిరాసియ్యమంటే, "స్కైలాబ్ పడితే మీరు మాత్రం మిగుల్తార్రా? ఆస్తి ఎందుకు రాయడం?" అన్నారు.

మొన్న మొన్న 2012 లో యుగాంతం అని కోవిదులైన జ్యోతిష్కులు కొందరు వక్కాణించారు. దాంతో రాస్తున్న నవల ఆపేసి, సుమారు ఐదు ఆరేళ్ళ వరకూ బిజీ అనుకుంటూ, సినిమాల మీద సినిమాలు ఒప్పేసుకుంటున్న హీరోలని జాలిగా చూసాను.

"నిజమేనట పిన్నీ. ఈసారి డిసెంబర్ 2012 తర్వాత ప్రపంచం ఉండదుట" అని పక్కింటి ఆండాళమ్మ అర్జెంటుగా అప్పు చేసి వడ్డాణం చేయించేసుకుంది. నేనైతే సంవత్సరం మొత్తానికి ఆవకాయ పెట్టడం మానేసా!

మా దూరపు బంధువు ఉన్న ఇల్లూ వాకిలీ అమ్ముకుని వరల్డ్ టూర్‌కి వెళ్ళిపోయాడు.

సుబ్బారాయుడు తనకి ప్రమోషన్లు ఇవ్వని బాస్‌గాడు కూడా అంతం అయిపోయే ఆ శుభఘడియ కోసం ఘడియలు లెక్క పెట్టుకుంటూ కూర్చున్నాడు.

అయినా యుగాంతం రాలేదు. దాంతో నేను ఆపేసిన నవలా, చేస్తూ మధ్యలో ఆపేసిన సీరియల్స్ వెక్కిరించాయి. పాలకవర్లు, ప్లాస్టిక్ మగ్గులూ, పాత పేస్ట్ డొక్కులూ అన్నీ పోగు చేసి అమ్మి, ఆ సంపాదనతో మురిసిపోయే మా ఆడబిడ్డ, ఇవన్నీ పోగు చెయ్యడం ఎందుకులే అని డిసెంబర్ తర్వాత మానేసి, యుగాంతం రాకపోవడంతో ఆ జ్యోతిష్కులందర్నీ తిట్టిపోసింది.

ఇలా మధ్య మధ్యలో ఆశావాదులు యుగం అంతరించిపోతుంది అంటూ పుకార్లు లేవనెత్తి కొంత పని తగ్గిస్తుంటారు.

కానీ అదేం విచిత్రమో.. యుగాంతం వస్తోంది కదా అని పాలవాడు పాలలో నీళ్ళు కలపడం మానలేదు. పనిమనిషి కడుపు నెప్పని డుమ్మా కొట్టి సినిమాల కెళ్ళడం మానలేదు. ఆకు కూరలవాడు గోంగూర ఇంకో కట్ట ఎక్కువ ఇవ్వలేదు. బంగారం గ్రాము మీద రూపాయి తగ్గలేదు. డాలర్ రేట్ ఇంకా కొమ్మెక్కి కూర్చుంది. చింతపండు ధర కూడా పైసా తగ్గలేదు. మనుషులకి రేపు ప్రపంచం ఉండదని తెలిసినా ఈ పూట వరకూ కక్కుర్తే. సాయంత్రం మిర్చి బజ్జీలూ, పుణుకుల బండి పెట్టాడా లేదా? పెళ్ళాం రాత్రి పూరీలోకి ఆలూ కుర్మా చేస్తోందా లేదా? పప్పులోకి వెన్నకాచిన నెయ్యి ఉందాలేదా? కోటీశ్వరుడికి వాడి డబ్బులు ఇంగువ మూటలా కట్టి తను చూడని, చూడబోని మూడోతరం, నాలుగోతరం వాళ్ళకి దాచామా లేదా? ఇదే యావ. ఈ యుగాంతం వల్ల మధ్య తరగతి వాడికేవైనా విరక్తి కలిగి ఆ చేసే కాస్త పనీ ఆపేస్తాడేమో కానీ, దావూద్ ఇబ్రహీంలూ గట్రా ఏ పనీ మానలేదు. టెర్రరిస్టులూ, తాలిబన్లూ యుగాంతం వస్తే తమకి పని మిగలదేమో అని కక్కుర్తిగా వినాశనాలూ, బాంబులెయ్యడాలూ ఎక్కువగా చేసేసారు. వాళ్ళకి ప్రకృతి మీద కూడా పగా ప్రతీకారమే.

సరే. యుగాంతం అక్కర్లేదు. "రేపు ప్రొద్దుట నుండీ మీరు కల్పించుకున్న, కృత్రిమంగా నిర్మించుకున్న చిన్న ప్రపంచం. ఫేస్ బుక్ నిలిపేస్తున్నాం, అదీ 'ఆర్కూట్'లా తీసేస్తున్నాం" అన్న ప్రకటన వస్తే అసలు సగం జనాభా ఏమైపోతుందో అన్న ఊహే నన్ను కుదిపేసింది.

తాయరమ్మ అప్పటిదాకా ఎఫ్.బీలో పెడ్తున్న చిత్రవిచిత్రమైన వంటలు మానేసి, వంటింటికి తాళం పెట్టేసింది.

"తాయారూ అన్నంలోకి ఏం చేస్తున్నావే?" అని భర్త కుటుంబరావు అడిగితే, విసుక్కుంటూ "ఊర్కోండీ.. చూడ్డానికీ, లైకులు కొట్టి, కామెంట్స్ పెట్టడానికి ఎఫ్.బి ఫ్రెండ్సు ఏమన్నానా?" అని ముక్కు చీదుతుంది. మొగుడికి నీళ్ళచారూ, చింతకాయపచ్చడీ.

ఇంక సౌందర్యరావు అయితే బజార్లో, చేతిలో తన ఫోటో పట్టుకు తిరుగుతూ "డూ యూ లైక్ ఇట్? మీ కామెంట్ ఏవిటి?" అని తిరుగుతుంటాడు.

దేవదానమ్మ అయితే పుట్టిన రోజులూ, పెళ్ళి రోజులూ... ఎవరితో పంచుకోవాలో తెలీక ఏడుస్తూ కూర్చుంటుంది.

సుఖేష్ తింటున్న మిర్చి బజ్జీ, మిడ్‌నైట్ బిరియానీ, హలీమ్ ఫోటోలు తీసి, ఇంట్లో గోడలనిండా అతికిస్తుంటాడు ఏడుస్తూ.

ప్రయాణాల్లో ఫోటోలూ, ఫేస్‌బుక్ పోస్టింగులూ లేక మొగుళ్ళూ పెళ్ళాలూ ఒకరిని ఒకరు తిట్టుకుంటూ, పిల్లల్ని కొట్టుకుంటూ, జర్నీలు చేస్తుంటారు.

"నువ్వూ అట్లాగే అనుకున్నావా? నేనూ అట్లాగే అనుకున్నాను వదినా" అని కబుర్లకి ఎఫ్.బి వాల్‌లేక మళ్ళీ గోడల మీద నుండి కబుర్లు. "ఆ వనజాక్షి కొత్త నెక్లెస్ కొనుక్కుందని మహా గీరపోతోంది. నేను 'లైక్' చెయ్యకపోతే బావుండదని, 'బొటన వేలెత్తి' చూపించాను కానీ 'సోనైస్' అని కామెంట్ చెయ్యనొదినా" అని మాట్లాడుకుంటూ కనిపిస్తారు అమ్మలక్కలు. కవిరాణులూ, కవిరాజులూ "ఎందుకీ సన్మానాలు? బహుమతులు? ఎక్కడ పోస్ట్ చేసుకోను? ఎవరు లైకులు కొడ్తారు? ఎవరు కామెంట్లు పెడ్తారు?" అని విరక్తిలో దుప్పట్లు కప్పించుకునే ప్రోగ్రాంలకి స్వస్తి చెప్తారేమో.

ప్రొద్దుటే లేచి విచిత్ర "ఫీలింగ్ మార్నింగ్ సిక్‌నెస్ లాంటి" స్టాటస్‌లు ఎక్కడ పెట్టాలో తెలీక కాంపౌండ్ వాల్‌కో గేటుకో అతికిస్తుందేమో!

ఇంక ట్విట్టర్ కూడా తీసేస్తే కేవలం ట్వీట్స్ మీదే బతికే ట్వీటరాయుళ్ళు ఏమైపోతారో?

ఒక మేధావి.. ఇంట్లో అసలు కిచెన్ ఉండకూడదు. నాకు వంట అంటే అసహ్యం. తిండి అంటే రోత. నేను బాగా ఆకలేస్తే ఒక రొట్టె తింటాను (అది పాచిపోయినా అతనికి అభ్యంతరం లేదు అనుకుంట) అని ట్విట్టర్‌లో పెడ్తాడు.

వెంటనే అతని అనుచరులు లేదా అనుసరించేవారు "గ్రేట్ గురూజీ" అని కింద కామెంట్స్ పెట్టేస్తూ "ఆకలేస్తోందే... భోజనం వడ్డించు. రోజూ సొరకాయా, వంకాయా ఏవిటే? ఆదివారం చికెన్ చెయ్యొచ్చుగా?" అని అరుస్తూంటారు. ఇంక కొందరు కేవలం తమకి పగ ఉన్న వారిని తిట్టడానికే ఈ ట్విట్టర్లూ ఎఫ్.బీలూ వాడుతుంటారు.

నాకు ఓసారి మర్కటరావు కొడుకు లింగేశ్వర్ మార్కెట్‌లో కనిపించాడు. ఎంతో ఆప్యాయంగా "అమ్మా నాన్నా బావున్నారా?" అని పలకరించాను.

"నేను మీకు తెలుసా ఆంటీ?" అని ఆ పదేళ్ళ పిల్లాడు ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వు పుట్టిన ఆరో నిమిషంలో మీ నాన్న నీ ఫోటో ఎఫ్.బీలో పెడితే "అచ్చు మహేష్ బాబులా ఉన్నాడు మీ బాబు" అని కామెంట్ కొట్టా."

అప్పటినుండీ నీ పాకే ఫోటోలు, నువ్వు ఐస్ క్రీమ్ నాకే ఫోటోలు నీ నడకలు, పలుకులు, అన్నీ మా మొహాల మీదేగా. ఎంత పెద్దవాడివైనావు నాయినా. అప్పుడే కూరలు కొనడానికొచ్చావు" అని కళ్ళు తుడుచుకున్నా. మన కళ్ళ ముందు కాదు, మన చేతుల్లో సెల్‌ల్లో, ఐపాడ్‌లలో పెరిగిపెద్దవుతున్న పిల్లలు వీళ్ళు. ఆప్యాయంగా ఉండదు మరీ?

స్ఫటికమాల సీరియల్‌గా వారింటి విశేషాలు రాస్తుంటుంది ఎఫ్.బీలో. "ఈ రోజు అరిటికాయ పొడి చెయ్యమన్నారు నాన్నగారు. ఆవపెట్టి వండమన్నాను నేను. అమ్మకి అటు కట్టుకున్న భర్తా ఇటు కన్న కూతురూ. అరటికాయతో కత్తిపీట ముందు కూర్చుంది. ఏం చేసిందో రేపు చెప్తాను. అందాకా వెయిట్ చెయ్యండి ఫ్రెండ్స్" అంటుంది.

"అక్కయ్యా ఆగలేము.. ఇప్పుడే చెప్పు" అని మారాం చేస్తాడు ఓ తమ్ముడు.

"ఆపెట్టే వండుతారు ఆవిడ.. బెట్!" అంటాడు ఓ పందేల అమర్‌నాథ్.

"అరిటికాయ పొడి ఎలా చేస్తారో చెప్పు చెల్లాయ్?" అంటుంది ఓ జిజ్ఞాసమ్మ.

ఇలా సీరియల్‌గా తన ఇంట్లో సంఘటనలన్నీ రాసేస్తుంటుంది ఆవిడ.

అసలు జనాలు డైరీలు రాయడం లాంటివి మానేసారు. కవితలు రాసి పత్రికాఫీసులకి కాళ్ళరిగేట్లు తిరగడం మానేసారు. హాయిగా ఎన్ని తప్పులున్నా అడిగేవాళ్ళు లేరు. ఎఫ్.బీలో పోస్ట్ చేసేసుకుని, తర్వాత అచ్చేసి అమ్మేసుకుంటున్నారు ఎంచక్కా.

మధ్యాహ్నం మనం టీ పెట్టుకుంటామా ఎఫ్.బీ తెరుచుకుని అంతా పెట్టే సమోసా పకోడీల ఫోటోలు చూస్తూ తాగేసుకోవచ్చు.

ఇంక ఫోటోలు పెట్టడం కోసమైనా కొన్ని సోషల్ సర్వీస్‌లు చేసేస్తున్నారు గబగబా కొంతమంది. రోడ్లు ఊడ్చే అంకమ్మ చీపురు లాక్కుని వైణిక గబుక్కున ఫోజిచ్చి "స్వచ్ఛ్ భారత్‌కి నా వంతు" అని పోస్ట్ చేస్తుంది. అలాంటిది ఒక్కసారిగా ఎఫ్.బీ రేపటినుండి ఉండదు అంటే తట్టుకోగలరా? యుగాంతం అయితే అందరూ తమతోబాటు పోతారు కాబట్టి బాధలేదు. ఎఫ్.బీ అలా కాదే. అంతా ఉంటారు కానీ మనకి లేరు అంటే ఈ జనం ఏమైపోతారో పాపం?

Post your comments




